
ప్రజాశక్తి
సోమవారం 1 జనవరి 2024
5
విజయనగరం





జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ప్రజాశక్తి 2024 కేలండర్, డైరీలను జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్నెన్నో ఆశలతో..

- కొత్త ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలతో సరికొత్త సంవత్సరంలోకి
- వేడుకగా నూతన సంవత్సర సంబరాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిర్రున తిరిగే కాలచక్రంలో 2023వ సంవత్సరం చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. 2024వ సంవత్సరం కొన్ని గంటల ముందే రానే వచ్చేసింది. గడిచిపోయిన సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ... 2024వ ఏడుకు స్వాగతం పలుకుతూ జనం ఒకింత ఉత్సాహంతో కేరింతల నడుమ కేకులు కట్ చేస్తున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పరస్పర పలకరింపులు, వాట్సాప్ మెసేజ్‌లు ఆదివారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. ఇదంతా షరా మామూలే. ఈ కేక్ కటింగులు, పలకరింపులు కేరింతలు, నూతన సంవత్సర వేడుకలు ఎప్పుడూ జరుగుతున్నవే. కానీ, ఈ ఏడాది నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ముఖ్యంగా శాఖల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లు బరువెక్కిన గుండెలతో అడుగు పెడుతున్నారు. మునుపెన్నడూ లేనంతగా పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు సతమతమౌతున్నారు. రైతులు పుట్టెడు దు:ఖంతో ఉన్నారు. గతేడాది జిల్లాలో తీవ్ర వర్షాభావంతో కొంతమంది, మిచౌంగ్ తుపానుతో కురిసిన భారీ వర్షాలతో మరికొంతమంది రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వ విధానాలతో పలు రకాల వ్యాపారులు, వృత్తిదారులు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలోనైనా తమ సమస్యలు పరిష్కారం కావాలని ఉద్యోగులు, ప్రకృతి కరుణించాలని, ఇప్పటికే జరిగిన నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఇక సగటు ప్రజానీకం పెరిగిన ధరలు తగ్గించాలని, రోజూ పనులు దొరకాలని ఆరాటపడుతున్నారు. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాకపోయినప్పటికీ నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆశలు, ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలు మనసులు మెదలడం సహజమే. ఎదుగుదలకు, ఆలోచనలకు ఆటకంగా మారుతున్న అలవాట్లను వదిలించుకోవాలని భావించేవారు కొందరైతే, కొత్త విధానాలు అమలు చేసుకుని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొంచుకోవాలనే వారు మరికొందరు. సాదాసీదాగా సాగి పోతున్న జీవితంలో నూతన సంవత్సరం కొత్త జోష్ నింపాలని కొందరు కోరుకుంటారు. ఈ మాటకొస్తే... కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామనే ఆలోచనలు కుర్రకారు నుంచి వృద్ధుల దాకా ఒకింత నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. వారం పది రోజుల ముందు నుంచే నూతన సంవత్సరంలో ప్రారంభించబోయే పనులు, లక్ష్యాల గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుంటారు. ఐతే గతంతో పోలిస్తే నూతన సంవత్సర వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పదేళ్ల క్రితానికి వెళ్లే గ్రీటింగు, టెలీఫోన్ సమాచారాల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకునేవారు. అంతకు మునుపు వారం రోజుల ముందు నుంచే గ్రీటింగుల పంపే క్రమంలో పోస్టాఫీసులు కిటకిటలాడేవి. ఈ ఇప్పుడా పరిస్థితి లేదు. సప్తసముద్రాలు దాటివున్నవారు కూడా కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్ ద్వారా వీడియో కాన్ఫరెన్సు కలుసుకునే పరిస్థితి కొన్నేళ్ల కిందటే వచ్చేసింది. ఇప్పుడు మరింతగా పెరిగింది. ఇక అతిథులను, పెద్దలను కలుసుకునే క్రమంలో పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు అందజేసుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. కేక్ కటింగ్ షరా మామూలే. ఈ క్రమంలో పండ్లు, స్వీటు దుకాణాలు, బేకరీలు, రంగులు విక్రయించే షాపులు ఆదివారం ఉదయం నుంచే సందడిగా కనిపించాయి. ముందస్తు ఆర్డర్లతో వ్యాపారులు బిజీబిజీగా మారారు.

ఇక మందుబాబుల హడావుడి విజయనగరంలో హద్దులు దాటింది. మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. పూటుగా తాగిన కుర్రకారు అర్ధరాత్రి దాటాక బైక్ రైడింగ్‌లతో వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఏదైనా ఈ హడావుడి ఈ ఒక్కరోజే. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జనం మనసుల్లో మెలిగే ఆశలు, ఆకాంక్షలు, కొత్తకొత్త ఆలోచనలు ఆచరణాత్మకం కావాలని, మంచి ఫలితాలను ఇవ్వాలని, ముఖ్యంగా పుట్టెడు సమస్యలతో సతమతమౌతున్న రైతులు, ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లు,

ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో పయనించాలి

మంత్రి బొత్స సత్యనారాయణ



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలి. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలి. గతేడాది జిల్లా అభివృద్ధిలో మైలురాయి అయిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టాం. వచ్చే ఏడాది జిల్లా అభివృద్ధికి మరింత ఆశాజనకంగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నాం.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు..

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



జిల్లాలో వివిధ వర్గాల వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలు, కార్యక్రమాలతో గతేడాది గణనీయమైన పురోగతి సాధించాం. ఈ ఏడాది కూడా ఈ అభివృద్ధి పథాన్ని కొనసాగిస్తూ జిల్లా మరింత పురోగతి సాధిస్తుంది. నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతూ తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలి. కొత్త ఏడాది వారి జీవితాల్లో వెలుగులు నింపాలి.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

మా ప్రతిష్ట తగ్గినా.. మీ గౌరవం పెంచాం

'గడపగడపకు..'లో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

తమ ప్రతిష్ట తగ్గినా ప్రజల గౌరవాన్ని ప్రభుత్వం పెంచిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఆదివారం మండలంలోని పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆధ్వర్యాన నియోజకవర్గ చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ ప్రతి పేదవాడు పక్కింటికి అప్పు కోసం పోకుండా ప్రతి వ్యక్తికీ లబ్ధి చేకూరేలా పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సభకు వచ్చిన వారిని ఉద్దేశించి మీలో ఎవరికైనా పథకాలు రాకుండా ఉన్నాయా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మహిళలకు పసుపు కుంకాలు ఇచ్చి పసుపు రాశారని, కానీ తమ ప్రభుత్వంలో ఏదైతే చెబుతామో అది చేసి చూపిస్తామని తెలిపారు. మునుపెన్నడూ పాఠశాలలను ఇంత అందంగా చూశారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంపైనా విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలను ఉద్దేశించి అన్నారు. మరి గత ఐదేళ్లు ఏం చేశారని నిలదీశారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే ముందుగా పూర్తి చేశారని, అందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్.మురళీకృష్ణ, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏపి ప్రధానోపాధ్యాయుల సంఘం 2024 కేలండర్, డైరీలను జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయులపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వేణుగోపాలరావు, టి.సన్యాసిరాజు, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఎ.వి.రమణ, కోశాధికారి సాయి చక్రధర్ పాల్గొన్నారు. ఎపిటిఎఫ్ (1938) కేలండర్, డైరీని జెడ్‌పి ఛైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.ఈశ్వరరావు, సిహెచ్ వెంకటరమణ, ఎ.సదాశివరావు, కృష్ణ పాల్గొన్నారు.



హెచ్‌ఎంల అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్‌పి ఛైర్మన్

అభివృద్ధి బాటలో విజయనగరం

ఏడాదిలో 34 పథకాలతో రూ.2,661 కోట్ల లబ్ధి : జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో విజయనగరం జిల్లా పురోభివృద్ధిలో దూసుకుపోతోందని జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిరస్థాయిగా నిలిపి ఉంచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇది జిల్లా చరిత్రలో మేలు మలుపని, అభివృద్ధికి వరమని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుండి జిల్లా వాసులు కంటున్న కలను సాకారం చేస్తూ, ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి ప్రారంభించారని వెల్లడించారు. గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి కేంద్ర మంత్రితో కలిసి సిఎం జగన్ శంకుస్థాపన చేయడం మరో మలుపని అన్నారు. జిల్లాలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. గత ఏడాది కాలంలోనే జిల్లాలో 34 పథకాలను అమలు చేయడం ద్వారా సుమారు సుమారు రూ.2,661 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. జనవరి రెండో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మొదలు అవుతుందని వెల్లడించారు. పంట పొలాలకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం 516 ఇ, ఎన్‌హెచ్ 130సిడి జాతీయ రహదారుల నిర్మాణం జోరుగా సాగుతోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా నిర్వహిస్తూ, వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు కెవిఎస్ శివరామరాజు, పి.శ్రీరాములు పాల్గొన్నారు.

పెరిగిన మోసాలు.. తగ్గని దొంగతనాలు

- స్వల్పంగా తగ్గిన ప్రమాదాలు
- పెరిగిన పోక్సో కేసులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతేడాది వివిధ రూపాల్లో మోసాలు పెరిగాయి. ముఖ్యంగా నిరుద్యోగాన్ని ఆసరా చేసుకుని ఉద్యోగాల పేరిట బురిడీ కొట్టించే కేసులు పెరిగాయి. దొంగతనాల సంఖ్య పెద్దగా తగ్గలేదు. ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గింది. చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడిన వారిపై పోక్సో కేసులు నమోదై నిందితులకు శిక్షలు ఖరారయ్యాయి. గంజాయి వినియోగం విచ్చలవిడిగా మారింది. హత్య, కిడ్నాపింగ్, గ్రీవియస్ హర్ట్, హత్యాయత్నం వంటి కేసులు గతేడాది కంటే తగ్గాయి. 2022లో హత్య కేసులు 23 నమోదు కాగా, 2023లో 16 కేసులు నమోదయ్యాయి. దీంతో, ఈ తరహా కేసులు 30 శాతం తగ్గినట్టు పోలీసులు చెబుతున్నారు. 2022లో కిడ్నాపింగ్ 66 కేసులు నమోదు కాగా, 2023లో 20 కేసులు నమోదయ్యాయి. 2022లో వరకట్న వేధింపుల వల్ల ముగ్గురు మరణించగా, గతేడాది కూడా ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వరకట్న వేధింపుల కేసులు 2022లో 319 నమోదుకాగా, 2023లో 270 కేసులు నమోదై, 15 శాతం తగ్గాయి. 2022లో రేప్ కేసులు 4 నమోదుకాగా, గతేడాది రెండు కేసులు నమోదయ్యాయి. మహిళల గౌరవానికి భంగం కలిగించే కేసులు 2022లో 179 నమోదుకాగా, 2023లో 108 కేసులు వరకు నమోదయ్యాయి. పోక్సో కేసులు 2022లో 44 నమోదు చేయగా, 2023లో వాటి సంఖ్య 57కు పెరిగింది. ఇందులో 8 కేసుల్లో నిందితులకు 20 ఏళ్ల కంటే ఎక్కువగా జైలు శిక్షలు పడగా, 2 ఏళ్లకుపైగా మూడు కేసుల్లో జైలు శిక్షలు పడ్డాయి. 2023లో బందిపోటు దొంగతనం కేసు ఒకటి నమోదైంది. రోబరీ కేసులు 2022లో 4 నమోదుకాగా, 2023లో 3 కేసులు నమోదయ్యాయి. పగటిపూట దొంగతనం కేసులు 2022లో 28 నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదయ్యాయి. రాత్రిపూట దొంగతనాలు 2022లో 107, 2023లో 105 కేసులు నమోదయ్యాయి. సాధారణ దొంగతనాలు 2022లో 343 నమోదు కాగా, 2023లో 335 కేసులు నమోదయ్యాయి. రహదారి ప్రమాదాల్లో 2022లో మృతులు 227 నమోదుకాగా, 2023లో 157 కేసులు మాత్రమే నమోదయ్యాయి. రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారి కేసుల్లో 2022లో 510 నమోదు కాగా, గతేడాది 491 నమోదయ్యాయి. వైట్ కాలర్ నేరాలు గతేడాది స్వల్పంగా పెరిగాయి. 2022లో 82 కేసులు నమోదు కాగా, 2023లో ఆ సంఖ్య 117కు పెరిగింది. సైబరు నేరాల సంఖ్య 141 నుంచి 92కు తగ్గింది. 2022లో డిస్పోజ్ అయిన కేసుల్లో గతేడాది 3653 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయి. 3445 ఐపిసి కేసుల్లోను, 208 స్పెషల్ అండ్ లోకల్ లా కేసుల్లో నిందితులకు 2023లో శిక్షలు ఖరారయ్యాయి. గంజాయి అక్రమ రవాణదారులపై కేసులు 2022లో 51 కేసులు నమోదు కాగా, గతేడాది 58 కేసులు నమోదు చేసి 2,558 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడిన నగదును పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక (ఫైల్)

12వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఉద్దేశించి సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. శనివారం మంత్రితో జరిగిన చర్చల్లో సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మెను విరమించాలని కోరడం సరికాదన్నారు. జీతాలు లేక, రెగ్యులర్ చేస్తామని చెప్పిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రభుత్వంతో కబడ్డీ

వినూత్న రీతిలో అంగన్వాడీల నిరసనలు ● 20వ రోజుకు నిరవధిక సమ్మె

అంగన్వాడీ నిరవధిక సమ్మె పతాక స్థాయికి చేరుతోంది. పాలకుల అదిరింపులకు, బెదిరింపులకు ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మె విరమించేది లేదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వానికి రోజుకో రూపంలో తమ నిరసనలు తెలియజేస్తున్నారు. ఆదివారం జిల్లాలో అంగన్వాడీల సమ్మె శిబిరాల్లో ఆటలాడుతూ నిరసనలు తెలిపారు. వినూత్నరీతిలో తమ డిమాండ్లనే కూత పెట్టి కబడ్డీ ఆడారు.



విజయనగరంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-గజపతినగరం

జిల్లాలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. గజపతినగరంలో అంగన్వాడీల సమ్మె శిబిరంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలిపారు. వీరికి ఐద్వా నాయకులు హరికృష్ణవేణి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సుభాషిణి, జ్యోతి నాయకులు నాగమణి, సన్యాసమ్మ, రమణమ్మ, సుజాత, పార్వతి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద ఆదివారం ఆటపాట అనే కార్యక్రమం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : కలెక్టరేట్ ఎదుట చేపట్టిన అంగన్వాడీల నిరవధిక దీక్ష శిబిరం వద్ద కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సహనాన్ని పరీక్షిస్తుందని, మహిళలు ఆగ్రహానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గురికావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సుశీల, రాధ, ఉష, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బాడంగి : బాడంగిలో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఆటలాడుతూ నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. వీరికి సిఐటియు నాయకులు సురేష్ మద్దతు తెలిపారు.

జామి : జామిలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరంలో అంగన్వాడీలు పలు ఆటలతో నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గాడి అప్పారావు, కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో ఆట, పాటతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు శ్రీదేవి, జయలక్ష్మి, వనజ, మంగమ్మ, చిన్నతల్లి, సత్యవతి, పార్వతి, ఈశ్వరమ్మ, మీనా, జయమ్మ, మాలతి పాల్గొన్నారు.



శృంగవరపుకోటలో ఖోఖో ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



గజపతినగరంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



రాజాంలో పాట పాడుతూ నృత్యం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొత్తవలస

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలతో ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చింతలపాలెం గ్రామంలో జల జీవన్ మిషన్(జెజెఎం) ద్వారా రూ.35.50 వేల వ్యయంతో చింతలపాలెం, గొల్లపేట గ్రామాలకు 610 ఇంటి ఇంటి కుళాయిల పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నాలుగున్నర ఏళ్ల పరిపాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనుల్లి కూడా చేపడుతూ ప్రజల మౌలిక కల్పనకు కూడా ప్రాధాన్యతిస్తున్నారన్నారు. ఇంత మంచి చేసిన మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారినే మళ్లీ సిఎం గా గెలిపించుకోవాల్సిన భాద్యత మన అందరిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సన్యాసిరావు, ఎంపిపి నీలంసెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, నాయకులు బొంతల వెంకటరావు, మేళాస్త్రీ అప్పారావు, పల్లా భీష్మ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు 'సాధన' వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు వృద్ధులకు నిత్యావసరాలు వితరణ అందజేశారు. ఆదివారం సాధన యువజన సంఘం సభ్యులు పోలుభోతు సంతోష్ కుమార్, ఎన్. అఖిల్ జన్మదిన సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న 35 మందికి, వెలుగు వృద్ధాశ్రమం విజయనగరంలో నిత్యావసరాలు బ్రెష్, టూత్ పేస్టు, బిస్కెట్స్, సర్ఫ్ పాకెట్స్, బియ్యం, ఆయిల్ ప్యాకెట్, భోజనం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఈసి మెంబర్ పోలుబోతు దుర్గాప్రసాద్, సాధన సభ్యులు డొంక పూర్ణ చంద్ర, ఎన్ విజయ్ కుమార్, నైట్ షెల్టర్ ప్రతినిధి టి.రామకృష్ణ (బాలు) ఐఆర్‌సిఎస్‌పి ఆర్‌ఒ ఎం. రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం, అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నీతి కథలు చదవడం, చెప్పడం, క్యారం బోర్డ్, చదరంగం, ఇతర ఆటలు ఆడించామని చెప్పారు.

5న పెంచిన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి


తహశీల్దార్ శ్యామలకుమారి

మండలంలోని 39 గ్రామపంచాయతీలలో వైఎస్ఆర్ పింఛన్ పథకంలో భాగంగా పెంచిన పింఛన్లను ఈ నెల 5న పంపిణీ చేస్తామని ఎంపిడిఒ శ్యామలకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ రూ.2,750 నుంచి పింఛన్‌ను మూడు వేల రూపాయలకు ప్రభుత్వం పెంచడంతో మూడో తేదీన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లాంచ్ చేస్తారన్నారు. షెడ్యూల్ ప్రాప్తికి మండలంలో ఈ నెల 5న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లతో బహిరంగ సభ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. అంతవరకు లబ్దిదారులు ఇబ్బందులు పడవద్దని వెల్లడించారు. లబ్ధిదారులు సచివాలయ పరిధిలో ఉన్న వాలంటీర్లకు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

మాది పేదల ప్రభుత్వం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రేగిడి

వైసిపి పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వం అని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఖండ్యాం గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. పేదవాడే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, సర్పంచ్ కోవగాన ముత్యాలమ్మ, ఎంపిటిసి కింజరాపు సురేష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొలివి జగ్గునాయుడు, గొలివి అనురాధమ్మ, సూర్యనారాయణ, బూసి ప్రసాద్ రావు, తంగి ప్రసాద్ రావు, బూసి అప్పలనాయుడు, నక్క రమణయ్య, పాడి లక్ష్ము నాయుడు, నెల్లి పెంటంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అదితి గజపతిరాజు

37వ డివిజన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని బిసి కాలనీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పూసపాటి అదితి గజపతిరాజు ఆధ్వర్యాన బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడాలంటే టిడిపి – జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు.

టిడిపిలో చేరికలు

నగరంలో 43వ డివిజన్‌కు చెందిన పడాల పుష్ప, పడాల ఆదినారాయణ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు అశోక్ బంగ్లాలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూసపాటి అదితి గజపతి రాజు సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపిని వీడి వారంతా టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అను'మతి' ఉన్నట్టా.. లేనట్టా..?

● గోపాలపురం ఇసుక ర్యాంపు నిర్వహణపై అనుమానాలు ● నాగావళి నదికి అడ్డుకట్ట వేసి ఇసుక దోపిడీ ● మూడు తాగునీటి పైలెట్ ప్రాజెక్టులు, వంతెనకు ముప్పు ● దిగువ ప్రాంతాలకు వెళ్లని నీరు

వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. కొన్ని ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా నదిలో జెసిబిలు పెట్టి ఇసుకను తవ్వేస్తున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా తవ్వి లారీలతో తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు. తాగునీటి ప్రాజెక్టులు, వంతెన చుట్టు పక్కల ఇసుక తవ్వకూడదన్న నిబంధనలను సైతం లేక్క చేయకుండా తవ్వేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏకంగా నది మధ్యలో నుంచి అడ్డుకట్ట వేసి కిందకు నీటిని విడుదల చేయకుండా ఇసుకను తవ్వేయడంతో నదీ పరివాహక ప్రాంతాల రైతులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నదీ గర్భంలో జెసిబితో అక్రమంగా తవ్వుతున్న అక్రమార్కులు

ప్రజాశక్తి- రేగిడి

సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస నాగావళి నది ఆనించి పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ మండలం గోపాలపురం ఇరు గ్రామాలకు సంబంధించి నాగావళి నదిలో ఇసుక ర్యాంపు అనుమతులు లేకుండా యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ నాగావళి నదిని దోచేస్తున్నారు. అక్కడ తవ్వకాలు చూస్తుంటే ఈ ర్యాంపునకు అనుమతులున్నాయా? లేదా అన్న అనుమానం కలుగుతుంది. 24 గంటలూ అధిక సంఖ్యల లారీలతో ఇతర ప్రాంతాలకు మాన్యువల్ పద్ధతిలో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అనువుగా నది మధ్యలో నుంచి అడ్డంగా పొడవునా పెద్ద ఇసుక ర్యాంపును తయారు చేసి జెసిపిలతో ఇసుకను తవ్వి లక్షల రూపాయలు కాసులు వెనకేసుకుంటున్నారు.

నదికి అడ్డంగా కట్ట

ఇసుకను తవ్వేందుకు అనువుగా నాగావళి నదికి అడ్డంగా అడ్డుకట్ట వేశారు. దీంతో దిగువ ప్రాంతాలకు చుక్క నీరు వెళ్లడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ, కొండ్రు మురళీమోహన్ 5 మండలాలకు తాగునీటి ఇబ్బందులు దృష్ట్యా రూ.147 కోట్లతో మూడు తాగునీటి పైలెట్ ప్రాజెక్టులను నిర్మించి ప్రారంభించారు. ఇప్పుడు ఆ తాగునీటి ప్రాజెక్టుల సమీపంలోనే తవ్వకాలు చేస్తుండటంతో భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది.

వంతెనకూ తప్పని ముప్పు

రాజాం -పాలకొండ ప్రధాన రహదారిలో సంకిలి వద్ద నాగావళి నదిపై వంతెన ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఈ వంతెనకు సమీపంలోనే తవ్వకాలు చేస్తున్నారు. దీంతో వంతెన దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. ఈ ఇసుక దోపిడిలో స్థానిక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని గోపాలపురం, బొడ్డవలస గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వరదలు వస్తే ప్రమాదమే

ఈ ఇసుక రవాణా కారణంగా నది మొత్తాన్ని దోచేయడంతో వరదలు వస్తే గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పైగా నదిలో ఇసుక లేకుండా తవ్వేయడంతో నీటి కష్టాలు కూడా పడతామని చెబుతున్నారు. ఇసుక రవాణా చేస్తున్న సిబ్బందికి ఆన్‌లైన్ రసీదులు, మ్యానువల్ రసీదులు కూడా ఇవ్వకుండా ఇసుకను వందల లారీలతో అక్రమ రవాణా చేస్తున్నారు. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులున్నాయని సిబ్బందిని అడిగితే సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడంతోనే ఈ ర్యాంపునకు ఎటువంటి అనుమతులూ లేవని తేటతెల్లమవుతోంది. కాగా ర్యాంపునకు సంబంధించిన సూపర్‌వైజర్ మహేష్‌ను వివరణ కోరగా మీకు నచ్చినట్లు రాసుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం కొసమెరుపు. ఇప్పటికైనా రెండు జిల్లాల రెవెన్యూ, మైన్స్, ఎస్‌ఇబి అధికారులు దృష్టి సారించి నదిని దోచేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లకుండా నదికి అడ్డంగా వేసిన గట్టు

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జాతీయ స్థాయి పురుష, మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారిణి ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ రాజీవ్ గాంధీ యునివర్సిటీలో డిసెంబరు 28 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి మెన్, ఉమెన్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొండ వెలగాడకు చెందిన బెల్లాన భార్గవి ఆదివారం 40 కిలోల విభాగంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. ఇదే పోటీల్లో యువజన విభాగంలో చంద్రం పేటకు చెందిన కె. దినేష్ 67 కిలోల విభాగంలో స్నాచ్ 108 కిలోలు, క్లీన్ జర్క్ 132 కిలోలు మొత్తం 240 కిలోలు బరువెత్తి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. వెంకట రామయ్య, కోచ్ చల్లా రాము అభినందించారు.



దినేష్, భార్గవి

క్రీడాకారుల ప్రోత్సాహానికే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేశ్‌బాబు అన్నారు. ఇటీవల మాస్టర్ అథ్లెట్ పోటీల్లో పూతిక పేటకు చెందిన పి. పైడి రాజు గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఆదివారం మొయిదలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సచివాలయ పరిధిలోనూ ఈ క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల ప్రతిభ గల క్రీడాకారులకు తగిన వేదికను కల్పించాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పండుగలా ఈ క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ ఈ తరహా పోటీలు జరగలేదన్నారు. పైడిరాజు మరెన్నో మెడల్స్ సాధించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. నెల్లిమర్లలో షటిల్ బ్యాడ్మింటెన్ క్రీడా వసతి గురించి క్రీడాకారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. స్టేడియం లేక ఇబ్బందులు పడుతున్నామని క్రీడాకారులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. షటిల్ ఆడేవాళ్లు సుమారు వంద మంది వరకూ ఉన్నారని, స్టేడియం నిర్మిస్తే క్రీడాకారులను తయారు చేసేందుకు ఉపయోగపడుతుందని విన్నవించారు. ఆ మేరకు, త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి క్రీడావసతి కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దవళ లక్ష్మణరావు, నెల్లిమర్ల షటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ ప్రతినిధులు వి.ఎం.కె. లక్ష్మణరావు, నల్లి శివ, శ్రీను, శేఖర్, రంగా, మద్దిల చిన్నా, భాస్కరరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుడుని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నేమ్‌ప్లేట్ మార్చండి

ప్రజాశక్తి - వేపాడ

మండలానికి ఎస్ కోట ఆర్‌టిసి డిపో నుండి వేపాడ మీదుగా ఆనందపురం వెళ్లే ఆర్‌టిసి బస్సుకు ముందు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బస్సు ముందు భాగాన నేమ్ బోర్డు బడి బస్సు అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసి పెట్టి ఉంది. దీంతో ప్రయాణికులు ఇది బడి బస్సు అని ఎక్కడం లేదు. ఆనందపురం పేరు చిన్నగా పెట్టి బడి బస్సు అని పెద్దగా రాయడం వల్ల దూరంగా ఉండి బస్సు ఆపే ప్రయాణికులకు బడి బస్సు అని మాత్రమే కనిపించడంతో ఎక్కడం లేదు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్సు ముందు భాగాన ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బడిబస్సు అని రాసి ఉన్న బస్సు ఇదే

3న రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సు

ప్రజాశక్తి - భోగాపురం

ఈ నెల 3వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి పంచాయితీరాజ్ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ అన్నారు. భోగాపురంలో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు అధ్యక్షతన విజయవాడలో ఈ రాష్ట్రస్థాయి పంచాయతీ రాజ్ సదస్సును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 12,918 గ్రామాల నుండి రాజకీయాలకు అతీతంగా ప్రస్తుత, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ఆహ్వానించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ సదస్సుకు చంద్రబాబు ఆహ్వానించామ న్నారు. పంచాయతీల అభివృద్ధి లేదని ఈ సదస్సులో పలు అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులకు రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం పంపిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్ల దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందన్నారు. ఈ సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రైతు సోమినాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, రాజారావు

జెసి రాజుకు సత్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

రోటరీ అధ్యక్షులు జెసి రాజుకు విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కారం చేశారు. రోటరీ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'డిసీస్ ప్రివేన్షన్ అండ్ ట్రీట్మెంట్' లో భాగంగా బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఎ హాస్పిటల్ సిఇఒ సింద్రి శ్రీనివాసన్ సహకారంతో డిసెంబర్ నెలలో 7 ఉచిత వైద్య శిబిరాలను రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు నిర్వహించారు. ప్రతి మెడికల్ క్యాంప్‌లో గోఖుల్ ఫార్మసీ కాలేజ్ ఫార్మా డి(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ మెడికల్ క్యాంప్‌లను నిర్వహించారు. ప్రజలకు సేవలను అందించే అవకాశం కల్పించినందుకు గోఖుల్ కాలేజ్ ఫార్మా డి విద్యార్థులు రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజును ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో నిర్వహించే వైద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఫార్మా డి విద్యార్థులను భాగస్వామ్యం చేయాల్సిందిగా వారు కోరారు. జెసి రాజు స్పందిస్తూ విద్యార్థి దశ నుండే సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం, ప్రజల మధ్యన సేవాలందించటం అనేక అనుభవాలను నేర్పిస్తున్నదని తద్వారా జీవనశైలిని ఆదర్శప్రాయంగా చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసన్, చంద్రి నాయుడు, పాల్గొన్నారు.


రాజును సత్కరిస్తున్న విద్యార్థులు

రాజన్నా.. మీరైనా జగన్నకు చెప్పండి

● వైఎస్ఆర్ విగ్రహానికి మున్సిపల్ కార్మికుల వినతి
● నెల్లిమర్లలో అర్ధనగ్న ప్రదర్శన
● ఆరో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మున్సిపల్ కార్మికులు వినతి అందించారు. 'రాజన్నా.. మీరైనా జగనన్నకు చెప్పాల'ంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్‌మోహన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నామని చెబుతూనే పోటీ కార్మికులను దించి గందరగోళానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు, నిర్బంధాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీవీ రమణ, నగర కార్యదర్శి బి.రమణ, ఫెడరేషన్ నాయకులు భాస్కరరావు, రజిని, రాజు, శంకర్రావు, మజ్ను, స్కూల్ ఆయాల నాయకులు బేగం, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


నెల్లిమర్ల: అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్మికులు ఆదివారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రిటర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, డ్రైవర్లకు ఆక్యుపెన్ష్ అలవేన్స్ ఇవ్వాలని, బకాయి హెల్త్ అలవెన్సులు, జీతాలు చెల్లించాలని కోరారు. ఈ ఆందోళనలో మున్సిపల్ యూనియన్ నాయకులు టి. బాబూ రావు, బి.హరిబాబు, జె.శ్రీను, బి.రాము, టి. లక్ష్మీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పట్టణం

ఎక్కడికక్కడే చెత్త

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో ఉండడంతో పట్టణంలో చెత్త పేరుకుపోయింది. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికి అమలు చేయడం లేదు. ఎన్నికల హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కొన్నేళ్ల నుంచి కార్మికులు కోరుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 26 నుంచి కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేపట్టారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పట్టణంలో చెత్త పేరుకుపోయి కాలువలలో పూడికలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో నూతన వేడుకల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించారు. సాయంత్రం 6 నుండి 11 వరకు జరిగిన ఈ ప్రదర్శనలో శాస్త్రీయ నృత్యాలు, కామెడీ స్కిట్స్, సినిమా పాటలు, పౌరాణిక ఏకపాత్రాభినయాలు, ఆధ్యాత్మిక కోలాటాలను ఆడిటోరియంలోని ప్రేక్షకులు ఆస్వాదించారు. కోఆర్డినేటర్ జి. కరుణ కుమార్ రూపొందించిన రామాయణం నృత్య కోలాటం అందరినీ ఆకట్టుకుంది.


నృత్యం చేస్తున్న బాలికలు

వేపాడ: మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విజయనగరం: డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్ దంపతులు నూతన సంవంత్సర శుభాకాంక్షలు తెలిపారు.